గౌతమ బుద్ధుడు - జవహర్లాల్

(మహనీయుల మహితోక్తులు)

దేవులపల్లి రామానుజరావు

దొరుకుచోటు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాదు.

గౌతమ బుద్ధుడు - జవహర్లాల్

మహనీయుల మహితోక్తులు

దేవులపల్లి రామానుజరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాదు.

ద్వితీయ ముద్రణ
ప్రతులు 2000
ఆగష్టు 1983

వెల రూ 3-60 పైసలు

దొరకుచోటు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాదు.

ముద్రణ
శివాజీ ప్రెస్
సికింద్రాబాద్.

విషయ సూచిక

గౌతమ బుద్ధుడు

గౌతమ బుద్ధుడు



అది యీనాటి మాటకాదు, చాల సంవత్సరాల క్రింద జరిగిన సంగతి. రెండు వేల అయిదు వందల

సంవత్సరాల క్రిందటి ముచ్చట. అప్పుడు గంగానదికి ఉత్తరమున నున్న రాజ్యమును కోసల రాజ్యమని పిలిచెడి వారు. పూర్వము శ్రీరాముల వారిది యీ కోసల రాజ్యమే. శ్రీరాములు అయోధ్యా నగరమును రాజధానిగా చేసికొని యీ కోసల రాజ్యమును పాలించెను. ఇప్పటికిని దీనిని అయోధ్య పరగణాయని పిలిచెదరు. రెండువేల అయిదు నూర్ల సంవత్సరాల క్రింద యీ కోసల రాజ్యమును శుద్ధోదనుడను ఒక రాజు పాలించెను. ఆయనకు కపిల వస్తు పట్టణము రాజధానిగా నుండెను. ఆయన భార్య మాయాదేవి. వీరిద్దరు చాల మంచివారు. శుద్ధోదనుడు ధైర్యము పరాక్రమము కలిగిన రాజు. ఆయన ప్రజలను న్యాయముగా పాలించెను.

చాల కాలము వరకు శుద్ధోదనునికి మాయాదేవికి బిడ్డలు కలుగలేదు. కొడుకులు కావలెనని వీరు ఎన్నియో నోములు, వ్రతములు చేసిరి. తుట్ట తుదకు దేవుని అను గ్రహము వలన వీరికి ఒక కొడుకు పుట్టెను. ఆయనే గౌతమ బుద్ధుడు. గౌతమబుద్ధుని పుట్టుక అడవిలో జరిగెను. మాయాదేవి ప్రసూతి కొరకు తల్లిగారి యింటికి బయలుదేరి పోవు చుండగా, దారిలో ఒక అడవి యందు ఆమె నీళ్లాడి, గౌతమబుద్ధుని కనెను. ఈ విధముగా రాజ

కుమారుడైన గౌతమబుద్ధుడు అడవిలో జన్మించెను. గౌతమబుద్ధుడు చక్కనివాడు, అందాల బిడ్డ, తల్లి దండ్రుల గారాబు కొడుకు. ఈయనకు మొట్టమొదలు తల్లి దండ్రులు సిద్ధార్థుడను పేరు పెట్టిరి. పెరిగి పెద్దయిన తరువాత ఆయనకు బుద్ధుడను పేర్కు కలిగినది. సిద్ధార్థుడు వైశాఖ పూర్ణిమనాడు జన్మించెను. చిత్రమేమనగా యీాయన మరణించిన దినము కూడ వైశాఖ పూర్ణిమయే.

సిద్ధార్థుడు పుట్టిన సమయమున వింత శకునాలు గలిగినవట. ఈ శకునాలు కలుగుటకు కారణాలను తెలుప వలసినదని సిద్ధార్థుని తండ్రి జ్యోతిష్కులను పిలిచి అడిగె నట. అప్పుడు వారు పంచాంగాలను చూచి, లెక్కలు వేసి, ఈ పిల్లవాడు కొంత పెద్దపెరిగిన తరువాత రాజ్యమును గూర్చి, ప్రభుత్వమును గూర్చి శ్రద్ధ దీసికొనక యీ ప్రపంచమును విడిచిపెట్టిపోవునని ఆ శకునముల అర్థమని తెలిపిరట. తరువాత నిజముగా అట్లే జరిగినది. సిద్ధార్థుడు పుట్టిన వారమురోజుల తరువాత ఆయన తల్లి మాయాదేవి చనిపోయినది. ఆయన తల్లిలేని పిల్లవాడయ్యెను. ఈ తల్లిలేని పిల్లవానిని తండ్రి మిక్కిలి ప్రేమతో తన ప్రాణముతో సమానముగా చూచుకొని అల్లారుముద్దుగా పెంచెను. తండ్రి సిద్ధార్థునికి విశ్వామిత్రుడను గురువు వద్ద చదువు

చెప్పించెను. సిద్ధార్థుడు యీ విశ్వామిత్రుని వద్ద లెక్కలు, చదువు, చక్కగా, పట్టుదలతో నేర్చుకొనెను. సిద్ధార్థుడు తెలివితేటలు కలవాడు. అందుచేత చదువులో మంచి ప్రజ్ఞను కనపరచెను. సిద్ధార్థుడు కత్తిసాము, గుఱ్ఱముస్వారి, యుద్ధము చేయుట, బాణాలు వేయుట మొదలైన రాజులకు అవసరమైన విద్యలు కూడ చక్కగా నేర్చుకొనెను.

సిద్ధార్థునిది చిన్నప్పటి నుండి మిక్కిలి జాలి గుండె; మెత్తని మనస్సు. అందుచేత కష్టపడు వారిని జూచి, ఆయన దుఃఖము పొందెడివాడు. ఒక రోజున సాయం కాలము సిద్ధార్థుడు స్నేహితులతో తోటలో హాయిగా తిరుగు చున్నప్పుడు, ఒక పక్షి వచ్చి ఆయన కాళ్లమీద పడెను. ఆ పక్షిని చేతులలోనికి తీసికొని చూచి బాణము వేయుట వలన నెత్తురు కారుచున్నట్లు గమనించి, పక్షిని ఒడిలో పెట్టుకొని, బాణము తీసివేసి చేతులతో నిమురసాగెను. ఇంతలో దేవదత్తుడను ఇంకొక రాజకుమారుడు వచ్చి "ఈ పక్షిని నేను బాణముతో వేసితిని, అందుచేత ఇదినాది; దీనిని నాకు యిమ్ము" అని అడిగెను. అప్పుడు సిద్ధార్థుడు "ఈ పక్షిని నేను నీకు ఈయను; ఇదినాది; ఇది ఎంతో బాధలో నుండగా, నేను తీసికొని కాపాడినాను. నీవు దీనిని చంప దలచినావు. నేను దీనిని బ్రతికింప దలచితిని;

అందుచేత నేను దీనిని నీకు ఈయను" అని బదులు చెప్పెను. దానిపైన వారిద్దరికి జగడమయ్యెను. ఈ జగడమును తీర్పుటకు తెల్లవారి పండిత సభ యేర్పాటు చేయబడెను. ఆ సభలో పండితులు, యీ సంగతిని ఆలోచించి, "పక్షిని చంపదలచినవాడు, దేవదత్తుడు; దాని ప్రాణములను కాపాడ దలచినవాడు సిద్ధార్థుడు; అందుచేత యీ పక్షిమీద న్యాయముగా అధికారము సిద్ధార్థునికే కలదని" తీర్పు చెప్పి పక్షిని సిద్ధార్థునికి ఇప్పించిరి. ఇది సిద్ధార్థుని మంచితనమునకు, జాలి గుండెకు నిదర్శనము. చిన్నప్పటి నుండి ప్రాణికోటి కష్టమును జూచి, తాను దుఃఖము పొందెడివాడు సిద్ధార్థుడు. తండ్రి యీ సంగతిని గమనించి, జ్యోతిష్కులు సిద్ధార్థుడు పుట్టినప్పటి శకునములను గూర్చి తెలిపిన సంగతులు జ్ఞప్తికి దెచ్చుకొని, సిద్ధార్థుని బహు జాగ్రత్తతో పెంచెను. ఏ విధమైన కష్టము, దుఃఖము ఆయనకు కనపడ కుండునటుల యేర్పాటు చేసెను. ఎప్పుడు జూచినను సుఖము, ఆనందము మాత్రమే తన కొడుకుకు కనపడునటుల శుద్ధోదనుడు యేర్పాటు చేసెను. శుద్ధోదనుడు సిద్ధార్థునికి ఒక చక్కని కన్యను తీసికొని వచ్చి పెండ్లి జేసెను. ఆమె పేరు యశోధర. సిద్ధార్థుడు యశోధర కొంతకాలము ఆట పాటలతో, సంగీతముతో,

వినోదములతో, కాలము గడిపిరి. వారిద్దరికి రాహులుడను కుమారుడు కలిగెను. ఈ విధముగా సిద్ధార్థుడు యశోధర హాయిగా కాలము గడుపు చుండగా, అప్పుడప్పుడు సిద్ధార్థునికి కలలు వచ్చుట మొదలయ్యెను. ఈ కలలలో అతనికి ప్రపంచము లోని పేదతనము, కష్టము, దుఃఖము కనపడ సాగెను. అప్పుడప్పుడు, యీ కలలు కలిగినప్పుడు సిద్ధార్థునికి కలవరింతలు కూడ కలుగ సాగెను. తనకు తెలియని ప్రపంచము, ఆవల చాల ఉన్నదనియు, ఆ ప్రపంచములో, అనారోగ్యము, అజ్ఞానము, పేదతనము, దుఃఖము కలవని సిద్ధార్థునికి యీ కలలు తెలుప సాగెను. అందుచేత వెలుపలి ప్రపంచమును చూడవలెనను కోరిక సిద్ధార్థునికి కలిగెను.

ఈ కోరిక ప్రకారము ఒకనాడు తన సారథి యైన ఛన్నుని పిలిచి, రథము సిద్ధము చేయ వలెనని, తాను నగరము చూచెదనని ఆజ్ఞయిచ్చెను. ఛన్నుడు రథము సిద్ధము చేసి తీసుకొని వచ్చెను. ఈ సంగతి తండ్రికి తెలిసి కొడుకు కోరికను కాదన జాలక, కాదనినచో మనసుకు నొప్పికలుగునని గ్రహించి, పట్టణమున వీధులలో దుఃఖము, కష్టము కలిగించు సంగతులు ఏవియు కనపడ కూడదని ఆజ్ఞాపించి అందుకు తగిన యేర్పాటులు

చేసెను. అప్పుడు సిద్ధార్థుడు రథము యెక్కి పట్టణము చూచుటకు బయలు దేరెను. తండ్రి యెన్ని యేర్పాటులు, యెన్ని కట్టుదిట్టాలు చేసినప్పటికిని, కష్టములో నున్న నలు గురు వ్యక్తులు సిద్ధార్థునికి కనపడిరి. అందులో మొదటి వ్యక్తి ఒక ముసలివాడు; అతని ముఖము ముడుతలు పడి యుండెను; కండ్లు కనబడవు; శరీరము వంగినది. వెంట్రు కలు నెఱసినవి; కట్టెపట్టుకొని లేవలేక నడచుచుండెను. అప్పుడు సిద్ధార్థుడు సారథితో "ప్రపంచములో ఇత నొక్కడే యిట్లున్నాడా? ఇంకను ఇటువంటివారు కలరా?, అని అడుగగా సారధి "ప్రపంచము లోని వారందరు ఇదే విధముగా ముసలివారు కాగలర"ని తెలిపెను. అప్పుడు సిద్ధార్థుడు "నేను, నా భార్య, నా కుమారుడు కూడా ఇదే విధముగా ముసలి వారమగుదుమా?" యని అడుగగా ఔనని సారథి బదులు చెప్పెను. తరువాత వారొకచోట రోగముచేత బాధపడుచున్న ఒక బీదమనిషిని జూచి, రోగములు అందరికి కలుగునని సిద్ధార్థుడు తెలుసు కొనెను. ఇంకొక చోట చచ్చిపోయిన ఒక వ్యక్తి శవము తీసికొని పోవుట వారికి కనపడెను. ఇందు వలన ప్రతి వారికి చావు తప్పదని సిద్ధార్థుడు తెలుసు కొనెను. మరొకచోట కాషాయ వస్త్రాలు కట్టుకొనిన ఒక సన్యాసిని జూచి, సిద్ధార్థుడు యీ

సన్యాసికి తనవారు యెవ్వరులేరని, దుఃఖము విచారము లేదనీ, ప్రపంచమే ఆయన కుటుంబమనీ తెలుసుకొనెను. ఈ నాలుగు సంగతులు సిద్ధార్థుని మనస్సును బాధపెట్టి, ప్రపంచమును వదలిపెట్టి పోవలెనను కోరిక కలిగించెను.

ఈ నాలుగు సంగతులు చూచి సిద్ధార్థుడు యింటికి వచ్చెను. ఒకరోజు రాత్రి; భార్య, కొడుకు, తండ్రి మరియు ఇంటిలోని వారందరు నిద్రపోవు చుండగా సిద్ధార్థుడు ఇల్లు విడిచి, రాజ్యము విడిచి, తండ్రిని వదలి, భార్యను వదలి, కొడుకును వదలి అడవులకు వెళ్లిపోయెను. ప్రపంచములోని దుఃఖము చూచి మనస్సుకు నొప్పి కలిగి, ఈ దుఃఖము పోవుటకు దారిని తెలుసుకొన దలచి, సిద్ధార్థుడు అడవులలో, తిండిలేక, నిద్రలేక, కాలినడక మీద తిరుగసాగెను. ఇట్లు తిరుగు చుండగా, డస్సిపోయి, ఒకచోట ఒక చెట్టు క్రింద సిద్ధార్థుడు పడిపోయెను. అప్పుడు సుజాత అను ఒక స్త్రీ పండ్లు పాలు తీసికొని దేవుని పూజించుట కొరకు ఆ త్రోవ వెంబడి ఒక దేవాలయము నకు పోవుచు, చెట్టుక్రింద అలసట జెంది సొమ్మసిలి పడియున్న సిద్ధార్థుని జూచి, దగ్గరకు వెళ్లి, తన చేతిలో నున్న పాలను, ఒక్కొక్కబొట్టు అతని నోటిలోవేసి, మెల్లగా పాలన్నియు త్రాగించెను. తిండిలేక పడిపోయిన



కొండలు వర్షంగా కురిపిస్తున్న మన్మధుడు, అందుకు చలించని బుద్ధుడు.

సిద్ధార్థుడు యీ పాలబొట్లు త్రాగి సేదదీరి ఆమెను జూచి, "తల్లీ ! చిన్నప్పుడే నా తల్లి చనిపోయినది. నేను తల్లిలేని వాడిని. ఈ రోజు అడవిలో ప్రాణము పోవుచుండగా నీవు వచ్చి నన్ను రక్షించినావు. నిజముగా నీవే నా తల్లివి. ఈరోజు నుండి నా జీవితములో పెద్ద మార్పు వచ్చినది. మానవుని యందు దయకలిగి, లోకములోని దుఃఖమును తొలగించుటకు ప్రయత్నించ వలెనని ఈరోజున నీవు నాకు తెలిపినావు. ఇది నాకు జ్ఞానము కలిగించినది. ఈనాటి నుండి నేను యీ సందేశమును ప్రపంచమునకు తెలుప గలనని'' ఆమెకు మ్రొక్కి, ఆరోజు నుండి క్రొత్తగా జ్ఞానము కలిగి సిద్ధార్థుడు బుద్ధుడయ్యెను. ఆ చల్లని తల్లి సుజాత బుద్ధుని ప్రాణాలను కాపాడి లోకానికి ఎంతయో మేలు చేసినది. ఆ రోజు బుద్ధుడు పడిపోయిన చెట్టును బోధి వృక్షమని పిలిచెదరు. ఆ చెట్టు గయ ప్రాంతము నందలిది. గయ భారతీయులందరికి పవిత్రమైన పుణ్య క్షేత్రము. బుద్ధునికి జ్ఞానము కూడ ఇక్కడనే కలిగినది. అందుచేత దానికి బుద్ధగయ అని కూడ పేరు. చిత్రమే మనగా బుద్ధుడు పుట్టిన రోజు వైశాఖ పూర్ణిమ; మరణించిన రోజు వైశాఖ పూర్ణిమ; బుద్ధ గయలో బోధి వృక్షము క్రింద, సుజాతాదేవి దయవలన జ్ఞానము పొందిన రోజు



బుద్ధుడు శిష్యులకు తన సూత్రములను బోధించుట

కూడ వైశాఖ పూర్ణిమ. సిద్ధార్థుని జీవితములో వైశాఖ పూర్ణిమ మిక్కిలి ముఖ్య మైనది.

తరువాత సిద్ధార్థుడు బుద్ధుడై, ప్రపంచమునకు జ్ఞానము కలుగు త్రోవ చూప సాగెను. "కోరికలు ప్రపంచములో అన్ని కష్టాలకు కారణము. ఈ కోరికలు లేకపోతే కష్టాలు లేవు. ఈ కోరికలను వదలివేయ వలెను. అందు కొరకు భిక్షువులు కావలెను. భిక్షువులకు కోరికలు ఉండవు. మనము ప్రపంచమును అంతయును మన కుటుంబముగా జూచుకొనవలెను; సత్యము చెప్పవలెను; అసత్యము ఆడ గూడదు; అహింసను పాటింప వలెను; శాంతిని ప్రచారము చేయవలెను'' అని బుద్ధుడు ప్రజలకు ఉపదేశము చేసెను. "సత్యము తెలుసుకొన వలెను; సత్యము మాట్లాడ వలెను; సత్యముగా నడవవలెను. మానవులకు సేవ చేయ వలెను. అదియే భగవంతుని సేవ" అని కూడ బుద్ధుడు ఉప దేశించెను. ఇందువలన దుఃఖములు తొలిగి పోగలవని బుద్ధుడు నిర్ణయించెను.

తరువాత బుద్ధుడు రాజు వేషము విడిచివేసి, సన్యాసి వేషము దాల్చెను. ఆ వేషముతో ఆయన ఊరూరు తిరిగి ప్రజలకు పై సంగతులను తెలిపెను. ఆయన తన రాజధాని ప్రజలకు భార్యకు, తండ్రికి గూడ తాను తెలుసు



నిర్వాణం పొందిన బుద్ధుడు

కొనిన సత్యము బోధించెను. తన తమ్ముని, మరదలిని తన ఆశ్రమము లోనికి తీసికొని వెళ్లి, వారికి గూడ బౌద్ధ మతము యిచ్చెను. ఆయన బ్రతికి ఉండగానే ఎన్నియోవేల మంది ఆయన శిష్యులైరి. తన మతమును ప్రచారము చేయుటకు ఆయన తన శిష్యులను ఇతర దేశాలకు గూడ పంపెను. ఈ విధముగా ఇతర దేశాలలో బౌద్ధ మతము వ్యాపించినది. బుద్ధుడు మరణించిన తరువాత కొంత కాలమునకు మన దేశమును అశోకుడను రాజు పాలించెను. ఆ రాజు ధర్మాత్ముడు; చాల మంచివాడు. ఆయన ఇంచు మించుగా భారతదేశ మంతటిని పాలించెను. ఒకసారి ఆయన తన శత్రువైన కళింగరాజుతో యుద్ధము చేసి కళింగరాజును ఓడించెను. ఈ యుద్ధములో ఎందరో చని పోయిరి. యుద్ధభూమిలో ఎక్కడ జూచినను రక్తము వరదలు కట్టి ప్రవహించెను. ఈ రక్తపు వరదలు అశోకుని మనస్సుకు నొప్పి కలిగించెను. అందువలన యుద్ధాలు మంచివి కావని, శాంతి మనకు అవసరమని అశోకుడు గ్రహించి, బుద్ధుని బోధనలను తెలుసుకొని బుద్ధ మతమును తీసుకొనెను. తరువాత ఆయన ఇతర దేశాలకు ప్రచారకు లను పంపి, బుద్ధ మతమును ప్రచారము చేయించెను. ఈ విధముగా బుద్ధ మతము ఇతర దేశాలలో వ్యాపించెను. సిలోన్, బర్మా, చైనా, టిబెట్, కాంబోడియా మొదలైన

దేశాలలో బుద్ధమతము బాగుగా వ్యాపించినది. ఈ నాటికిని ప్రపంచములో బుద్ధ మతమును అనుసరించువారు చాల మంది గలరు. వీరి సంఖ్య మొత్తము ప్రపంచము యొక్క జనాభాలో ఇంచు మించుగా సగము కలదని చెప్పెదరు.

మన దేశమున జన్మించిన వారిలో బుద్ధుడు చాల గొప్ప వ్యక్తి. ఆ రోజు ఆయన చేసిన బోధనలు, యీరోజు కూడ అందరు అనుసరించుటకు తగి యున్నవి. ఈ కాలమున జన్మించిన గాంధీ మహాత్ముడు బుద్ధ భగవానుని వంటివాడు.

బుద్ధ భగవానుని వలె గాంధీ మహాత్ముడు సత్యమును, అహింసను పాటించవలెనని బోధించెను. బుద్ధ భగవానునికి అశోకుడు యెటువంటివాడో, గాంధీమహాత్మునికి మన ప్రధాని జవహర్‌లాల్ అటువంటి వాడు. అశోకుడు బుద్ధుని బోధనల ప్రకారము నడచినట్లే, జవహర్ లాల్ నెహ్రూ గాంధీ మహాత్ముడు చెప్పినట్లు నడచి, గాంధీజీ ఆదేశాలను ప్రపంచమునకు తెలిపినాడు. యుద్ధాలు మంచివి కావు; రక్తపు వరదల వలన లోకమునకు మేలు కలుగదు; మనకు శాంతి కావలెను; ప్రపంచములో శాంతిని సాధించవలెను అని జవహర్ లాల్ నెహ్రూ తెలిపినాడు. ఇది

ఆనాడు బుద్ధుడు, అశోకుడు తరువాత ఇటీవల గాంధీజీ చేసిన బోధనల కనుగుణముగా నున్నది.

మన దేశమునకు ఇతర దేశాల నుండి ముఖ్యముగా చైనా నుండి గొప్ప విజ్ఞానులు వచ్చి బుద్ధుడు పుట్టిన చోటును, తిరిగిన చోటులన్ను, చూచి పోదురు. పూర్వకాలమున ఫాహియాన్, హూయాన్‌సియాంగ్ అను ఇరువురు చైనా యాత్రికులు మన దేశానికి వచ్చి, స్వయముగా బుద్ధుడు నివసించిన చోటులను చూచి, ఆయన బోధనలు ఆయన శిష్యుల వలన విని బౌద్ధ మత గ్రంథాలను చదివి వెళ్లిరి. బుద్ధుని శిష్యులు మన దేశమున గొప్ప విశ్వ విద్యాలయాలను నడిపిరి. అమరావతి, ధాన్యకటకము తెలుగు దేశములోని బౌద్ధ విశ్వ విద్యాలయాలు. చక్కని శిల్పముగల కట్టడములను బౌద్ధులు నిర్మించిరి. ఇవి ప్రపంచ మంతటిలోను ప్రఖ్యాతి పొందినవి.

జవాహర్ లాల్ నెహ్రూ

జవాహర్‌లాల్ నెహ్రూ

మన దేశమునకు ప్రధానిగా సుమారు ఇరువైయేండ్లు పనిజేసి ప్రపంచములో కీర్తిగాంచినవాడు జవాహర్‌లాల్



నెహ్రూ. జవాహర్ అనగా రత్నము. జవాహర్‌లాల్ మన దేశ నాయకులలో రత్నము; ప్రపంచములోని గొప్ప వారందరిలో రత్నము. వీరి పూర్వులు కాశ్మీరు ప్రాంతము

వారు. కాశ్మీరు చాలా చక్కని చల్లని ప్రాంతము. మంచుతో నిండిన కొండలతో, పూలు, పండ్లు కలిగిన చెట్లతో,



తుపాకి పట్టుకొన్న బాల జవాహర్

తీగెలతో కాశ్మీరము భారతదేశములో ఒక సుందరమైన తోటవలె ఉన్నది. జవాహర్‌లాల్ పూర్వులు కాశ్మీరు నుండి చాలా కాలము క్రిందట ఢిల్లీకి వచ్చిరి. వారు మొగలు

చక్రవర్తుల క్రింద గొప్ప ఉద్యోగములు చేసిరి. ఢిల్లీలో వారు ఒక నదీతీరములో ఇల్లు కట్టుకొని యుండిరి. హిందీ భాషలో నహర్ అనగా నది. అందుచేత వారి కుటుంబము నకు నెహ్రూ కుటుంబమని పేరు కలిగినది. కొంతకాలానికి



తల్లి చెప్పుచున్న కథలను శ్రద్ధంగా వినుచున్న జవాహర్

వారు ఢిల్లీనుండి ఆగ్రాకు, ఆగ్రానుండి అలహాబాదుకు వెళ్లిరి. అలహాబాదు హిందువులకు పవిత్రమైన యాత్రా స్థలము. అలహాబాదును మనవారు "ప్రయాగ" అని

పిలిచెదరు. అక్కడ గంగ, యమున, సరస్వతి, అను మూడు నదులు ఒకచోట కలియు చున్నవి. దీనిని త్రివేణి



5 సం॥ వయస్సులో సైకిలు త్రొక్కుచున్న జవాహర్

సంగమ మని మనవారు పిలిచెదరు. ఈ పుణ్యస్థలమే జవాహర్‌లాల్ పుట్టిన చోటు.

అలహాబాదులో నెహ్రూ కుటుంబానికి చెందిన మోతిలాల్ అను గొప్ప న్యాయవాది యుండెను. ఆయన చాలా తెలివి కలవాడు. ఆయన తన వృత్తిలో చాలా డబ్బు

సంపాదించెను. మోతీలాల్ నెహ్రూకు 1889 లో ఒక కొడుకు పుట్టెను. ఆయనే మన జవాహర్‌లాల్ నెహ్రూ. జవాహర్‌లాల్, నెహ్రూ కుటుంబములో రత్నమువంటి వాడు. తల్లిదండ్రుల కనుల చందమామ, జవాహర్‌లాల్ తల్లి పేరు "స్వరూపరాణి" ఆమె గొప్ప ఇంటి యిల్లాలు. చల్లనితల్లి. జవాహర్‌లాల్‌కు అన్నదమ్ములు లేరు. ఇద్దరు చెల్లెండ్రు మాత్రము కలరు. ఒకఆమె 'విజయలక్ష్మి' రెండవ ఆమె 'కృష్ణ'. విజయలక్ష్మి ప్రపంచములో గొప్ప కీర్తిని సంపాదించినది. తల్లిదండ్రులకు మరియు కుటుంబము లోని వారందరికి జవాహర్ అంటే ఎంతో ప్రేమ; తండ్రి చాలా డబ్బు సంపాదించినందు వలన జవాహర్‌లాల్ చిన్న తనము హాయిగా గడచినది. చిన్నతనమున ఆయనకు డబ్బు లోటులేదు. ఇంటిలోని వారందరు ఆయనను అల్లారు ముద్దుగా పెంచిరి. అయితే జవాహర్‌లాల్‌కు మాత్రము తల్లిమీద చనువు, తండ్రి అనిన భయము. ఒకసారి ఆయన తండ్రి రెండు మంచి విలువగల "ఫౌంటెన్‌పెన్" లు తెచ్చుకొని తన టేబిల్‌మీద పెట్టుకొనెనట. పిల్లవాడైన జవాహర్‌లాల్ 'రెండు ఫౌంటెన్ పెన్‌లు తండ్రికి ఎందుకు? ఒకటి చాలదా' అనుకొని అందులో ఒక దానిని తీసికొని దాచుకొనెనట. తండ్రి ఇంటికివచ్చి ఒక ఫౌంటెన్‌పెన్

లేనందువలన ఇంటివారందరి మీద కోపపడెనట. కాని జవాహర్‌లాల్ తాను కలము తీసికొనిన సంగతి తండ్రికి చెప్పలేదు. తరువాత ఆ సంగతి తండ్రికి ఎట్లో తెలిసి ఆయన జవాహర్‌లాల్‌ను బాగుగా దెబ్బలు కొట్టెను. ఈ దెబ్బల గాయాలు మానుటకు చాల రోజులు పట్టెను.

పిల్లలందరి వలెనే చిన్నప్పుడు జవాహర్‌లాల్‌కు కథలంటె చాలా ప్రీతి. ఆయన తండ్రివద్ద "ముబారక్ అలీ" అను ఒక మున్షీ ఉండెను. ఆయన "అరేబియన్ నైట్స్" అను కథలు చెప్పితే జవాహర్‌లాల్ ఎంతో ఆసక్తితో చెవులు గోసికొని వినువాడు. ఆయన తల్లి రామాయణ మహాభారతములందలి కథలు చెప్పెడిది. ఈ కథలను గూడ ఆయన ఎంతో మక్కువతో వినెడివాడు. జవాహర్‌లాల్ తన చిన్నతనములోనే గుఱ్ఱము మీద సవారీచేయుట నేర్చుకొనెను. పెద్ద పెరిగిన తరువాత కూడ గుఱ్ఱము మీద సవారీ చేయుట ఆయనకు మిక్కిలి ఇష్టము. మోతీలాల్ తన కొడుకు కొరకు అరబ్ దేశానికి చెందిన ఒక గుఱ్ఱమును కొనియిచ్చెను. దీనిమీద ఆయన సవారీచేయుట నేర్చుకొనెను. ఈ గుఱ్ఱముమీద ఆయనకు మిక్కిలి ప్రేమ. ఆయన యీ గుఱ్ఱమును తన స్నేహితునివలె చూచుకొనెడివాడు. మున్షీ ముబారక్ అలీ చెప్పగా వినిన కథలను యీ

గుఱ్ఱానికి జవాహర్‌లాల్ చెప్పెడివాడు. ఒకరోజు సవారీ చేయుచుండగా గుఱ్ఱము ఆయనను క్రింద పడవేసి యింటికి వెళ్ళిపోయెను. గుఱ్ఱము మాత్రమే వచ్చి జవహర్‌లాల్ రానందున ఇంటిలోని వారందరు ఆదుర్దాచెంది ఆయనను వెదకుటకు బయలు దేరిరి. తరువాత కొంత సేపటికి జవా



కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నుకొన బడిన నెహ్రూ

హర్‌లాల్ క్షేమముగా ఇంటికి నడచివచ్చెను. దెబ్బలు తగులక సురక్షితముగా జవాహర్‌లాల్ ఇంటికి చేరుకొనుట అందరికి ఆనందము కలిగించెను. ఈ సంఘటన ఒకసారి మాత్రమే జరిగినది. తరువాత ఎప్పుడుకూడ ఇట్టిది జరుగ

లేదు. మొట్టమొదటిసారి 1930 సంవత్సరమున జవాహర్ లాల్ కాంగ్రెసు అధ్యక్షుడు అయ్యెను. ఆ సంవత్సరము కాంగ్రెసు మహాసభ లాహోరులో జరిగెను. అప్పుడు ఒక పెద్ద బ్రహ్మాండమైన ఊరేగింపు తీయబడెను. ఆ ఊరేగింపులో జవాహర్‌లాల్ గుఱ్ఱము మీద స్వారిచేసి ప్రజలకు కనుల పండువు చేసెను. ఇంతకు ముందు సంవత్సరము ఆయన తండ్రి మోతీలాల్ కాంగ్రెసుకు అధ్యక్షుడుగా నుండెను. లాహోరులో యీ పదవిని తండ్రి కొడుకునకు అప్పగించెను. కాంగ్రెసులో ఇట్టి అప్పగింతకు ఇదొక్కటే నిదర్శనము. తరువాత నాలుగైదు సారులు జవాహర్‌లాల్ కాంగ్రెసుకు అధ్యక్షుడయ్యెను.

పండుగలంటే జవాహర్‌లాల్‌కు ప్రీతి. హోలీ పండుగప్పుడు రంగులు చల్లుకొనుట ఆయనకు ఎంతో ఇష్టము. దసరా, దీపావళి, రామలీల మొదలైన పండుగ వేడుకలలో ఆటపాటలలో ఆయన ప్రేమతో పాల్గొనెడివాడు. ఈ పండుగలన్నిటిలో ఆయన పుట్టినరోజు పండుగను వారి కుటుంబము చాలా వైభవముగా జరుపుచుండెను. ఆరోజు ఆయనకు క్రొత్త బట్టలు, క్రొత్త కానుకలు ఇచ్చెడివారు. పండ్లు మిఠాయిలు ఆరోజు రకరకాలైనవి చేసుకొనెడివారు. సంవత్సరమునకు ఈ పుట్టినరోజు

పండుగ ఒకసారి మాత్రమే వచ్చెడిది. కాని పిల్లవాడైన జవాహర్ ఈ పండుగలు సంవత్సరానికి చాలసారులు రావలె నని అనుకొనెడివాడు. తన ఈడు పిల్లలు వారి యింటిలో యింకెవరు లేనందున ఒంటరితనము వలన జవాహర్‌లాల్‌కు కొంచెము కష్టము కలిగెడిది.

వారి యింటిలో వెడల్పైన ఒక మంచి కొలను ఉండెను. అందులో స్నానాలు చేసేవారు. ఈతలు కొట్టే వారు. వేసవికాలములో సాయంకాలపు వేళలలో జవాహర్ లాల్ తండ్రి మోతీలాల్ మరియు ఆయన స్నేహితులు ఈ కొలనులో స్నానములుచేసి వినోదముగా కాలము గడిపేవారు. జవాహర్‌లాల్‌కు ఈత కొట్టుట చాలా ఇష్టము. వేసవి కాలములో రోజునకు ఎన్నోసార్లు ఈ కొలనులో ఈత కొట్టెడివాడు. మోతీల్‌లావద్ద "తేజ్ బహద్దూర్ సప్రూ" అను గొప్ప న్యాయవాది పనిచేయు చుండెను. ఆయన కూడ ప్రతిరోజు సాయంకాలము ఈ కొలనువద్దకు వచ్చెడివాడు. అయితే ఆయనకు ఈతరాదు. నేర్చుకొన వలెనన్న ఉద్దేశముకూడ లేదు. ఊరక ఒడ్డున కూర్చొని వినోదముగా చూచెడివాడు. అందుచేత పిల్లలు ఆయనను నీటిలోనికి లాగుటకై ప్రయత్నముచేసి వేళాకోళము చేసెడి వారు. ఆ రోజులలో విద్యుచ్ఛక్తి తక్కువగా నుండెను.

అలహాబాదులో మొట్ట మొదటిసారి ఎలక్ట్రిక్ దీపములు నెహ్రూ ఇంటిలోనే వెలిగినవి. వారు తమ ఇంటికి ఆనంద భవనమని పేరు పెట్టుకొనిరి. ఎలక్ట్రిక్ దీపములు ఆ యింటి లోని శోభను ఎన్నియో రెట్లు ఎక్కువ చేసెను. ఆ యింటిలో జవాహర్‌లాల్ తన చిన్నతనమును ఆటపాటలతో గడిపెను. జవాహర్‌లాల్ తండ్రి మోతీలాల్, యీ యింటిని కాంగ్రె సుకు యిచ్చి ఆనంద భవనమునకు స్వరాజ్య భవనమని పేరు పెట్టెను. ఈ యింటిముందు ఇంకొక చిన్న యిల్లును వారు తమ కుటుంబముకొరకు కట్టుకొనిరి. జవాహర్‌లాల్‌కు తండ్రి మిక్కిలి శ్రద్ధతో చదువుచెప్పించెను. జవాహర్‌లాల్ చక్కగా చదువుకొని ఇంగ్లాండు దేశమునకుపోయి "బారిస్టరు" పట్టాను పొందెను.

ఇంగ్లాండులో చదువుపూర్తి చేసుకొనివచ్చిన తరువాత కొంత కాలము ఆయన న్యాయవాదిగా పనిచేసెను. తరువాత రాజకీయాలలోనికి వచ్చి మన దేశమునకు స్వాతంత్ర్యము సంపాదించుటలో ఆయన చాలా పనిచేసెను. నిజానికి ఈరోజు మన దేశము స్వాతంత్ర్యము పొందిన దన్నచో అందుకొరకై పనిచేసిన ముఖ్యులలో జవాహర్ లాల్‌నెహ్రూ. గాంధీజీ తరువాత చెప్పదగినవాడు. రాజకీయా లలో గాంధీ మహాత్ముడు ఆయనకు గురువు. గాంధీ



1912 సం॥లో బారిస్టరుగా నెహ్రూ

మహాత్మునికి ఈయనపై ఎంతో ప్రేమ యుండెను. గాంధీజీ అడుగుజాడలలో నడిచి జవాహర్‌లాల్ చాలసార్లు చెఱసాల

లకు పోయి దేశముయొక్క స్వాతంత్ర్యము కొరకు ఎంతో త్యాగముచేసి కష్టపడినాడు. చిన్నతనము నందే అనగా చదువుకొనే రోజులలోనే ఇంగ్లీషువారు మన దేశమునుండి వెళ్ళిపోవలెనను కోరిక ఈయనకు కలిగెను. అప్పుడు మన



మొదటి సారిగా జైలులో పెట్టబడిన నెహ్రూ

దేశమును ఇంగ్లీషువారు పాలించుచుండిరి. ఇంగ్లీషువారు మన దేశీయులను మంచిగా తమతో సమానముగా చూడక తమకన్న తక్కువగా చూచెడివారు. మన దేశముయొక్క

మంచిని గూర్చి వారికి పట్టుదల లేకుండెను. ఇది జవాహర్ లాల్ నెహ్రూకు కోపము కలిగించి మన దేశమునకు స్వరాజ్యము సంపాదించ వలెనను కోరిక కలిగించెను. చిన్న తనమునందు కలిగిన ఆ కోరికను పెద్దవాడైన తరువాత ఆయన సాధించెను. మన దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత మొట్ట మొదటి ప్రధాన మంత్రి శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ. ఆయన పరిపాలనలో మన దేశము చాల అభి వృద్ధికి వచ్చినది. ప్రజలకు ఎంతో మేలు కలిగినది; కలుగు చున్నది. ప్రపంచములో మన దేశానికి గొప్ప గౌరవము లభించినది. మన దేశమంటే జవాహర్‌కు మిక్కిలి ప్రేమ. మన దేశము యొక్క మేలుకొరకు మన ప్రజలయొక్క మంచికొరకు ఆయన రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసినారు.

మన దేశములోని పెద్దలందరికిని ఆయన మీద చాలా ప్రేమ. రవీంద్రనాథటాగూరు సరోజినీదేవి మొదలైన పెద్దలు ఈయనను మిక్కిలి ప్రేమతో చూచెడివారు. ఎక్క డికి వెళ్ళినా లక్షలకొద్ది ప్రజలు ఆయనకు స్వాగత మిచ్చే వారు. చైనా, అమెరికా, బర్మా మొదలైన విదేశాలకు వెళ్ళినప్పుడు కూడ అక్కడి ప్రజలు లక్షల సంఖ్యలో ఆయనకు స్వాగత మిచ్చిరి. మన దేశములోని ప్రజలకు ఆయనమీద మిక్కిలి అభిమానము. ఆయన సభలలో

ఉపన్యాసమిచ్చునపుడు వినడానికి లక్షల సంఖ్యలో ప్రజలు వచ్చేవారు. చాల సంవత్సరాల క్రిందట ఒకమారు ఈయన ఒకానొక సభలో ఉపన్యసించినపుడు నేల ఈనినట్లు ఇసుక



కమల్యానెహ్రూ. జవాహర్‌లాల్, ఇందిరాగాంధి

వేసిన రాలనట్లుగా గొప్ప సంఖ్యలో జనులు వచ్చిరి. సభ ముగిసిన తరువాత ఆ సభలో నుండిన సరోజినీదేవి ఈయనను దగ్గరకు పిలిచి "జవాహర్" వీరందరు నీ ఉప

న్యాసము వినుటకు వచ్చినారనుకుంటివేమో : నిజానికి వీరంతా నీ చక్కని మోమును చూచుటకు వచ్చినారని చమత్కార ముగ, ప్రేమతో ఎగతాళి చేసెనట. ఒకసారి అలహాబాదులో జవాహర్‌లాల్ ఉపన్యాసము జరిగినది. అది 1915వ సంవత్సరము. మొట్ట మొదటిసారి బహిరంగ సభలో ఆయన చేసిన ఉపన్యాసమదే. ఆ సభలో మన దేశమున గొప్ప న్యాయవాదియని కీర్తి గాంచిన 'తేజ్ బహద్దూర్ సప్రూ' గారు వేదిక మీద కూర్చొని యుండిరి. ఆనాడు జవాహర్ లాల్ ఉపన్యాసము వినిన తరువాత తేజ్‌బహద్దూర్ సప్రూ గారు ఎంతో సంతోషించి జవాహర్‌ను దగ్గరకు పిలుచుకొని కౌగలించుకొని ముద్దు పెట్టుకొనెను. జవాహర్‌లాల్ వంటి తెలివిగల చిన్నవాడు ప్రజాసేవ కొరకు ఈ విధముగా ముందుకు వచ్చుట సప్రూగారికి ఆనందము కలుగ జేసినది.

జవాహర్‌లాల్ నెహ్రూకు 1916వ సంవత్సరములో వసంత పంచమినాడు పెండ్లి జరిగినది. ఆయన భార్య కమలా నెహ్రూ. ఆమె చాలా మంచిది. ఆయనకు అన్ని విధాలా తగినది. ఆమెగూడ చాలసారులు చెరసాలలకు పోయి దేశము కొరకు కష్టాలు అనుభవించెను. పాపము, ఈ చెరసాలలకు పోవుటవలన ఆరోగ్యముచెడి ఆమె తొందరగా మరణించినది. ఇందువలన జవాహర్‌లాల్‌కు మిక్కిలి దుఃఖము కలిగినది. జవాహర్‌లాల్‌కు ఒక్కతే కూతురు.

ఆమె పేరు ఇందిర. ఇందిరమీద ఆయనకు మిక్కిలి ప్రేమ. తన ప్రాణముతో సమానముగ ఈయన ఆమెను చూచుకొనును. ఇందిరకు ఇద్దరు కొడుకులు. మనుమల



ప్రధాని నెహ్రూతో ముచ్చటగా గడుపుచున్న నికితాక్రుశ్చేవ్, మరియు రష్యా నాయకులు

మీద ఆయనకు చాల ప్రేమ. తీరిక దొరికినపుడు మనుమలతో ఆయన ఆడుకొనేవాడు. పిల్లలమీద ఆయనకు ప్రేమ. ఎక్కడ పిల్లలు కనపడినను వారిని దగ్గరకు పిలిచి ఆదరించే

వాడు. పిల్లలతో, ఆటపాటలలో కలిసి చిన్న పిల్లవానివలె వినోదించేవాడు. చైనాలోని పిల్లల కొరకు ఆయన మన దేశము నుండి ఒక ఏనుగును కానుకగా పంపించెను. విదేశాలలోని పిల్లలకు జవాహర్‌లాల్ మీద ఎంతో అభిమానము. ఆయన జైలులో ఉన్నప్పుడు తన కూతురైన ఇందిరకు ప్రపంచమును గూర్చి ఉత్తరాలు వ్రాసెను. ఆ ఉత్తరాలు పిల్లలందరు తప్పక చదువ తగినవి. ఆ ఉత్తరాలు చదువుట వలన ప్రపంచమును గూర్చి మంచి విజ్ఞానము కలుగును.

జవాహర్‌లాల్ శరీరము బలిష్టమైనది. ఆయన ముఖము మంచి కాంతివంతమైనది. ఎంతమందిలో కూర్చొని ఉన్నప్పటికి ఆయన పేరు తెలియనివారుకూడ ఆయనను చూచి ఆయన మిక్కిలి గొప్పవాడని చెప్పవీలుపడేది. ఆయన రూపములో, వ్యక్తిత్వములో మంచి ఆకర్షణ యుండెను. ఆయన సూర్యోదయము కాక పూర్వమే లేచి వ్యాయామముచేసి చన్నీటితో స్నానము చేసెడివాడు. ఇందువలన ఆయన తన ఆరోగ్యమును చక్కగా కాపాడు కొనగలిగెను. ఆయనకు మంచి అలవాటులు ఉండినవి.

జవాహర్‌లాల్ మనసు మిక్కిలి మెత్తనిది. ఆయన హృదయము వెన్నవంటిది. ఆయనకు జంతువులనిన

ప్రేమ. ఆయన దేశ సేవలో దిగకముందు అప్పుడప్పుడు తుపాకి తీసుకొని వేటకు పోవుచుండెడివాడు. ఒక రోజు ఆయన తన తుపాకితో ఒక జింకను కాల్చెను. అప్పుడు



ప్రధాని నెహ్రూకు భారతరత్న బిరుదుయిస్తున్న రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్

ఆ జింక కన్నీటితో ఆయన కాళ్ళముందుపడి చనిపోయెను. ఇది ఆయన హృదయమునకు నొప్పి కలిగించెను. వెంటనే

కనులనుండి నీళ్ళు జలజల రాలెను. ఇకముందు ఎన్నడు జంతువులను వేటాడగూడదని అప్పుడు ఆయన నిర్ణయించుకొనెను. ఆయనకు పక్షులమీద చాల ప్రేమ. పావురాలతో ఆడుకొనుట ఆయనకు ఇష్టమైనపని. ఆయన జైళ్ళలో ఉన్నప్పుడు పక్షులను పెంచి వానితో ఆడుకొనుచు కాలము గడిపేవాడు. ఇదే విధముగా కుక్కలను పెంచుటకూడ ఆయనకు ఇష్టమైనపని. జైళ్ళలో ఉన్నప్పుడు ఆయన జంతువులను పెంచి వానితో ఆడుకొని ప్రతిరోజు కొంత కాలము గడిపేవాడు. చెట్లను పెంచుటకూడ ఆయనకు ఇష్టమైన పని. జైళ్ళలో ఆయన నివసించునపుడు మంచి తోటలను పెంచి స్వయముగా ఆయనే చెట్లకు నీళ్ళు పోసేవాడు. తేనీరు సిద్ధము చేయుట ఆయనకు ఇష్టము. ఆయనతో పాటు అహమ్మద్‌నగర్ జైలులో వల్లభాయి పటేలు, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ మొదలైన దేశ నాయకులుండెడివారు. వీరికి ఆయన స్వయముగా తేనీరు సిద్ధముచేసి ఇచ్చేవాడు. ఆయన ప్రపంచములో ఇంచుమించుగ అన్ని దేశాలు తిరిగి వచ్చెను. ఇంగ్లీషు భాషలో ఆయనకు గొప్ప ప్రావీణ్యము ఉండేది. ఇంగ్లీషులో మంచి పుస్తకములు ఆయన వ్రాసెను. ఈ పుస్తకాలలో ఆయన 'జీవిత చరిత్ర' 'ప్రపంచ చరిత్ర' ముఖ్యమైనవి. ఇవి చాల

గొప్ప పుస్తకాలు. ప్రపంచములోని విజ్ఞానులందరు ఈ పుస్తకాలను మెచ్చుకొనిరి. ప్రపంచములోని విజ్ఞానులందరితో ఆయనకు మంచి స్నేహము ఉండేది. ఇంగ్లీషులో జార్జి



ప్రధాని నెహ్రూకు స్వాగత మిచ్చుచున్న అమెరికా అధ్యక్షుడు కెనడీ.

బెర్నార్డుషా గొప్ప రచయిత. ఆయన సాధారణముగ ఎవరిని మెచ్చుకొనేవాడుకాడు. అటువంటి బెర్నార్డుషా

మెప్పును పొందిన ముగ్గురి, నలుగురిలో జవాహర్‌లాల్ ఒకడు. జవాహర్‌లాల్ గొప్ప విజ్ఞాని. గొప్ప పండితుడు. సంగీతము, చిత్రలేఖనము, శిల్పము మొదలైన కళలమీద ఆయనకు చాలా అభిమానము. మంచి సినిమాలు చూచుట, మంచి పుస్తకాలు చదువుట ఆయనకు ఇష్టము. కులము మతము మొదలైన భేదాలు ఆయనకు లేవు. ఆయన ప్రజ లందరిని సమానముగా ప్రేమించెను. యుద్ధాలు ఆయనకు ఇష్టముకాదు. యుద్ధాలవలన మానవుడు నాశనము పొందుట ఆయన ఇష్టపడలేదు. అందుచేత ప్రపంచములో శాంతి కావలెనని ఆయనకోరెను. భారత ప్రధానిగా ఆయన ప్రపంచ శాంతి కొరకు పనిచేసినాడు. ఇందువలననే ఆయనను ప్రపంచములోని ప్రజలందరును ప్రేమించిరి. ఆయన మొట్ట మొదలు దేశ సేవకు ముందుకు వచ్చినపుడు ఆయనకు మన ప్రజలు "భారత భూషణ" "త్యాగమూర్తి" అను బిరుదులు ఇచ్చిరి. ఆయన చుట్టాలు, స్నేహితులు ఆయనను ఈ బిరుదులతో పిలిచి ఎగతాళి చేసెడి వారట. అప్పుడు ఆయన కుమార్తె "ఇందిర" చిన్నపిల్ల. ఇప్పుడు ఆమె మన దేశానికి ప్రధాన మంత్రి. ఆమె పూర్తిపేరు శ్రీమతి ఇందిరాగాంధీ. ఆమెకూడ తండ్రిని ఈ బిరుదులతో పిలిచి ఎగతాళి చేసేది. అయితే నిజానికి ఆయన గొప్ప త్యాగము చేసిన మహాపురుషుడు. రత్నము వంటివాడు. అందుచేతనే



జవాహర్ లాల్, లాల్ బహద్దుర్ శాస్త్రి

"గాంధీమహాత్ముడు" మన దేశములో నాయకులు ఎందరో ఉన్నప్పటికినీ తన వారసునిగా "జవాహర్‌లాల్"నే ఎన్నుకొని ఆశీర్వదించెను. దేశములో చదువుకొనినవారు గొప్పవారు చాలమంది ఉన్నప్పటికిని, మన దేశమునకు తగిన నాయకుడు, తగిన ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూయే అని గాంధీ మహాత్మునితోపాటు పెద్ద లందరును నిర్ణయించిరి. ప్రజలు ఆ నిర్ణయమును బలపరచిరి.

మన దేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత మొట్టమొదటి ప్రధాన మంత్రిగా జవాహర్‌లాల్ నెహ్రూ పనిజేసి మన దేశమును ముందుకు తీసుకొని వచ్చుటకు, ప్రజలకు మేలు కలుగ జేయుటకు మంచి కృషిని చేసినాడు. ప్రపంచములో శాంతిని స్థాపించుటకు ఆయన చేసిన ప్రయత్నాలు అన్నిరాజ్యాల మెప్పును పొందినవి. ఆయన ఆదర్శాలు రెండు. ఒకటి మన దేశముయొక్క అభివృద్ధి. రెండవది ప్రపంచములో శాంతి. ఈ రెండు పనుల కొరకు ఆయన తన సమయమును పూర్తిగా వినియోగించినాడు. ఒక్కొక్క దినమునకు ఇరువది నాలుగు గంటలు; ఈ ఇరువది నాలుగు గంటలలో పదునెనిమిది గంటలకుపైగా ఆయన పని చేసేవాడు. రాత్రింబవళ్లు కొద్ది విశ్రాంతితో దేశముయొక్క అభివృద్ధికొరకు ఆయన పాటు పడినాడు.



మహనీయుల మహితోక్తులు

హజ్రత్ ఖ్వాజా మొయినొద్దీన్ చిష్తి

ఖ్వాజా మొయినొద్దీన్ చిష్తి మహమ్మద్ ప్రవక్తకు అల్లుడైన హజ్రత్ అలీ వంశానికి చెందినవాడు. ఆయన తండ్రిగారు సయ్యద్ గయాసుద్దీన్ హసన్ సంపన్న కుటుంబీకుడైన పుణ్యమూర్తి. ఆయన తల్లి సయ్యదా బీబి పరమ సాధ్వి.

సిస్తాన్‌లోని సంజార్ నగరంలో 1142 వ సంవత్సరమున ఏప్రెల్ నెల 18 వ తేదినాడు ఖ్వాజాసాహెబ్ జన్మించెను. ఆయన తండ్రిగారే ఆయనకు మొట్టమొదట విద్యాభ్యాసము చేసిన గురువు. తరువాత యౌవన దశలో ఆయన మధ్య ప్రాచ్యదేశాలకు ముఖ్యంగా ఈరాఖ్, ఈరాన్ దేశాలకు వెళ్లి అక్కడి విద్వాంసులవద్ద చదువుకొని గొప్ప పాండిత్యాన్ని సంపాదించినాడు. అక్కడ ఆయన ఇస్లామ్ మత గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలించి అందులో సంపూర్ణ పాండిత్యాన్ని సంపాదించిన ఖ్వాజా ఉస్మాన్ హారూన్ ప్రభావానికిలోనై ఆధ్యాత్మిక రంగంలో అడుగుపెట్టినాడు.

ఆ తరువాత ఆయన అనేక దేశాలు పర్యటించి భారత దేశంలోని అజ్మీరుకు వచ్చి అక్కడనే స్థిరపడి అజ్మీర్ మహర్షిగా ప్రఖ్యాతి గాంచినాడు. భారతదేశంలోను, పాకిస్తానులోను ఇస్లామ్ మతంతో ఏకొద్ది పరిచయము కలవారికైనను ఆయన మత బోధనలు సుపరిచితాలు. అజ్మీరులో ప్రతిసంవత్సరం రజ్జబ్ నెలలో ఆయన వర్ధంతి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగడం ఒక ఆచారంగా ఉన్నది. ఆయనను ఖ్వాజా గరీబ్ నవాజ్ అని కూడా ప్రజలు జ్ఞప్తి చేసుకుంటారు. గరీబ్ నవాజ్ అనగా-పేదల పాలిటి పెన్నిధి అని అర్థము.

ఖురాసాన్‌లో చిష్తి అనే ఒక ప్రదేశము ఉన్నది. అక్కడ ఖ్వాజా ఉస్మాన్ హారూన్ ప్రతిపాదించిన సూఫీ మత సిద్ధాంతాలకు చిష్తిపీఠము అనిపేరు. ఆ పేరే ఖ్వాజా మొయినొద్దీన్ అధ్యాత్మిక సిద్ధాంతాలకు కూడా కలిగినది.

ఖ్వాజామొయినొద్దీన్ చిష్తి భారతదేశంలో ఇస్లామ్ మత ప్రచారము గావించిన ప్రముఖ ప్రవక్త. ఆయన చనిపోయి ఎనిమిది నూర్ల సంవత్సరములు గడిచిపోయి నప్పటికిని లక్షలమంది అనుయాయులు ఆయనకు ప్రపంచ మంతటను ఉన్నారు. ఇతర మతాల వారికి కూడ ఆయన

పట్ల గౌరవాభిమానాలు ఉన్నవి. పీడిత ప్రజల పట్ల - వారు ఏ కులము, ఏ ప్రాంతము, ఏ మతము, ఏ జాతి, ఏ రంగు, ఏ భాష వారైనప్పటికిని చిష్తి మిక్కిలి అభిమానము కలిగి యుండిరి. అందుచేత ఆయనను దీన బంధు అని చెప్ప వచ్చును. విశ్వమానవ సౌభ్రాతృత్వమే ఆయన ఆదర్శము.

ఆయన ప్రతిపాదించిన సూఫీ మత సిద్ధాంత సార మును ఒకసారి వినండి :- 'అందరినీ ప్రేమించండి- ఎవరినీ ద్వేషించవద్దు. మాటలలో శాంతి అన్నంత మాత్రాన ఒరిగేది ఏమీలేదు. భగవంతుడు, మతమూ అన్నంత మాత్రన కలిగే ఫలితము ఏమీలేదు. నీలో నిబిడీకృతమైన సమస్త శక్తులను వికసింపజేసి నీ ఆత్మోన్న తికి పాటుబడినప్పుడే సత్ఫలితాలు కలుగ గలవు. నీవు శాంతి ఆనందములను ఆకళించుకోవలెను. వానిని ప్రచారము చేయవలెను. సత్యమే పరమ ధర్మము. ప్రేమను శాంతిని ప్రజలలో వ్యాప్తి చేయవలెను. నీలో అణగిఉన్న విద్వేష భావాన్ని, సంకుచితత్వాన్ని నిర్మూలించి మంచితనాన్ని శాంతిని అలవరచుకొని ప్రజలలో సమరస భావాన్ని సోదర భావాన్ని అభివృద్ధి చేయడానికి పాటు పడవలెను. ఒక్క భగవంతుని తప్ప మరెవ్వరినీ ఏ

సహాయము కోరవద్దు. ఏ ప్రయోజనము కొరకు నీవు యెవరినీ అర్థించవద్దు. రాజుల ఆస్థానాలకు వెళ్లవద్దు. దీనులకు తోడ్పడడానికి వెనుదీయవద్దు. పేదలు, వితంతువులు, అనాధులు నీ సహాయ సహకారాలకు సర్వదా యోగ్యులు. వారు నీ దగ్గరకు వచ్చినప్పుడు నీ సంపూర్ణ సహకారము వారికి లభింప చేయవలెను. హిందుస్తాన్ ప్రజలలో శాంతి సౌభ్రాతృత్వములను వ్యాప్తిచేయడమే నీ ఆశయము కావలెను. దీనిని ఒక కర్తవ్యంగా భావించుకొని ధైర్యముతో సాధన చేయవలెను. నేను నీ గురువుగా, నీ దౌర్భాగ్యాలను గూర్చి జగత్సాక్షియైన ఆ భగవంతుని ముందు, ఆయనయిచ్చే తీర్పునాడు పవిత్రమైన మన సూఫీ మతానికి గురువులైన ప్రవక్తల ముందు తలవంచ వలసిన అవసరము లేనట్లుగా నీవు నీ ధర్మాన్ని నిర్వహించవలెను'.

ఉదార హృదయుడు, దయాసాగరుడు అయిన ఖ్వాజామొయినొద్దీన్ చిష్తి సమస్త మానవాళికి పూజ్యుడు-మానవత, విశ్వ సౌందర్యము ఆయన ఆదర్శాలు.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)

(18-6-79)

మహమ్మద్ ప్రవక్త

ధర్మానికి హాని కలిగినప్పుడు, అధర్మం చెలరేగినప్పుడు పరమేశ్వరుడు అవతరించి దుర్మార్గులను శిక్షించి, సాధువులను రక్షించి ధర్మ సంస్థాపనము కావించునని గీత చెప్పుతున్నది. ఇటువంటి ధర్మ సంస్థాపన జరిగిన సంఘటనలు ప్రపంచంలో అన్ని కాలాలలోను, అన్ని దేశాలలోను, కనిపిస్తున్నవి. గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త మొదలైనవారు యీ శ్రేణికి చెందిన మహనీయులు. మహమ్మద్ ప్రవక్త యిప్పటికి సుమారు 14 నూర్ల సంవత్సరాల క్రింద (క్రీ.శ. 570) అరేబియా దేశంలోని మక్కా-పట్టణమున జన్మించినాడు. ఈయన ప్రబోధించినది ఇస్లాంమతం. పరమేశ్వరుడు మహమ్మద్ ప్రవక్త ద్వారా ఇస్లామ్ మతగ్రంథమైన ఖురాన్‌ను ఆయనచేత పలికించినాడు. ఖురాన్ అనగా అతను పఠించినాడని అర్థము. పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట అని 'మన పోతనామాత్యుడు', అరబ్బీ భాషలో పరమేశ్వరుడు మహమ్మద్ చేత పలికించిన మాటలు సర్వకాలాలకు, సర్వజనులకు అనుసరణీయములుగా ఉన్నవి. కావుననే ఆ మాటలు విశ్వజనీనములని చెప్పవచ్చును.

మహమ్మద్ ప్రవక్త ఖురాన్‌లో పరమేశ్వర ప్రతినిధిగా చెప్పిన మాటలు మన మొకసారి స్మరిస్తే అవి యీనాటి ఆధునిక సమాజానికి, ప్రజాస్వామ్య యుగానికి సర్వవిధాల అనుసరణీయాలని స్పష్టమౌతున్నది. మత ప్రచారంలో బలవంతంలేదని "భక్తుడా! నీ వలె యితరులు అల్లాను పూజించకుండా ఉంటే, వారిని దూషించ వద్దు సుమా! ప్రతి వ్యక్తి తన ఇష్టానుసారముగా నన్ను పూజిస్తున్నాడు అని మహమ్మద్ ప్రవక్త చెప్పినాడు. కొంచం ఆలోచిస్తే యీ మాటలు నేటి సమాజానికి, లౌకిక ప్రజాస్వామ్య యుగానికి సర్వవిధాల అనుగుణంగా ఉన్న వని వెల్లడి యౌతున్నది.

మరొకచోట, యితరులను కష్టపెట్టినవాడు తనకు తానే కష్టాలను కొనితెచ్చుకొనునని, ఇతరులు చేసిన మేలును ఎప్పటికి మరువవద్దని చెప్పబడినది. ఈమాట సమస్త మతాలకు, సర్వజాతులకు, సకల దేశాలకు అను సరణీయం. ఖురాన్‌లో సత్యమన్నది ఆ అల్లాయొక్క విశేషణము; దానికే అంతిమ విజయం లభిస్తున్నదని చెప్పినపుడు "సత్యమేవ జయతి" అన్న సూక్తి వెంటనే జ్ఞప్తికి వస్తున్నది. అన్యాయంగా. నిష్కారణంగా స్త్రీలపై నిందలు మోపరాదని మహమ్మద్ ఉద్ఘాటించినాడు. నిన్నెవ

రైనా న్యాయము చేకూర్చమని అర్థిస్తే వాడు ఏమతస్థుడని ఆలోచించకుండా నిష్పక్ష పాతంగా న్యాయాన్ని చేకూర్చ వలెనని మహమ్మద్ సూక్తి. ఎవరికైనా, ఏమైనా వాగ్దానం చేస్తే దాన్ని తప్పకుండా నిలబెట్టుకోవలెనని, అది ప్రతి ఇస్లాంమతస్తుని బాధ్యతఅని ఒకచోట ఖురాన్‌లో ఉద్ఘాటించనైనది. మరొకచోట పరమేశ్వరుడు అందరినీ ముస్లింలుగా పుట్టించలేదని, ప్రపంచంలో ఇస్లాంమతం ఒక్కదానినే ఆయన స్థాపించలేదని అనేకమతాలు పర మేశ్వరుడు స్థాపించినాడని అది సృష్టి వైచిత్రమని మొహమ్మద్ వక్కాణించినాడు. విశ్వమానవుల సౌభ్రా తృత్వాన్ని, సకలజనుల సమాన స్థాయిని మహమ్మద్ ప్రవక్త ప్రతిపాదించినాడు; దయా దాక్షిణ్యాలు అతను ప్రబోధించినాడు; సత్కర్మలనే చేయవలెనని కోరినాడు. సత్యాన్ని అసత్యము వెనుక దాచిపెట్టవద్దని ఆయన నొక్కి చెప్పినాడు. అనాథులు ఆస్తులను అన్యాయంగా కాజేయు వాడు తనకు తానే హాని చేసుకుంటున్నాడని ఆయన వివరించినాడు. క్షమాగుణము పెంచుకోవలెనని, అందరిపట్ల దయగలిగి ఉండవలెనని, చెడును మంచితో ఎదిరించవలెనని మహమ్మద్ ప్రవక్త వక్కాణించి సత్‌శీలముగల మాన వుడు జగత్తులో అందరికన్నా అధికుడని, దురాశను

దూరంగా ఉంచవలెనని కోరినాడు. "ప్రభూ! నాలో చెడ్డ తలపులు కలగకుండా నన్ను రక్షింపుము. నాకు వివేకాన్ని, విజ్ఞానాన్ని ప్రసాదింపుము" అని ఆయన ప్రార్థించినాడు. మహమ్మద్ ప్రవక్త మతవిషయమున నిర్బంధము ఏమీ లేదని, ఎవరిమతం వారిదని సత్యాన్ని గుర్తించి దానిని నమ్మినవాడే నిజమైన భక్తుడని స్పష్టీకరించినాడు.

పరమేశ్వరునికి సర్వమూ తెలుసును. మనము చెప్పిన ప్రతిమాట, మన హృదయంలో దాగి వెలుపలకు రాని ప్రతిభావం ఆయనకు తెలుసును. ఆయన సర్వజ్ఞుడు. అందుచేత సరియైన మార్గంలో నడిచేవ్యక్తి ఆయనకు ప్రీతిపాత్రుడు. పాపంచేసి దానిని దాచవలెననే ప్రయత్నం భగవంతుని ముందు నిష్ఫలం అని మహమ్మద్ ప్రవక్త ఒకచోట వక్కాణించినాడు.

ఈ విధంగా ఖురాను ద్వారా మహమ్మద్ ప్రవక్త నోట పరమేశ్వరుని వాణి వినిపిస్తున్నది. ఆ వాణి అన్ని కాలాలలోనూ, అన్ని దేశాలలోనూ నివసించే జనులకు మార్గదర్శకంగా ఉన్నది.

ఆలిండియా రేడియో సౌజన్యంతో

(3-7-80)

గాలిబ్

మనదేశాన్ని మొగలురాజులు పరిపాలించిన కాలం యొక్క ప్రత్యేకతలు ఏవి అని ప్రశ్నిస్తే రెండింటిని వెంటనే పేర్కొనవచ్చును. ఒకటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సుందరమందిరం తాజ్ మహల్, రెండు ఉర్దూ మహా కవులలో సూర్యునివలె ప్రకాశించే గాలిబ్ మహాకవి. ఆయన ఫారసీ భాషలోకూడ వ్రాసిన భారతీయ ఉర్దూ మహాకవులలో చివరివాడు. మనదేశనాయకులలో ప్రఖ్యాతి గాంచిన మౌలాన అబ్దుల్ కలామ్ ఆజాద్ వ్యక్తిత్వంపైన గాలిబ్ ప్రభావం స్పష్టంగా గోచరిస్తున్నది. గాలిబ్ కవితను 'చొఘ్తాయి' వంటి ఉత్తమ చిత్రకారుడు, సైగల్‌వంటి గాయకుడు, హాలివంటి ఉత్తమ రచయిత అజరామరము గావించినారు. ఇది యెందరికో అబ్బే అదృష్టంకాదు.

గాలిబ్ యితర ఉర్దూ కవీశ్వరులవలె స్త్రీదృక్పథం కలిగినవాడుకాదు. ఆయనది పురుష దృక్పథం. మానవ జీవితాన్ని సమగ్రంగా తన కావ్యదర్పణంలో ప్రతిఫలింప జేసి జీవితాన్ని భిన్న దృక్పథాలలో చిత్రించిన మొట్టమొదటి ఉరూకవి గాలిబ్. ఆయన ఉర్దూలో గొప్పవచనరచయితకూడ.

గాలిబ్ కవితలో సమస్త మానవాళికి మార్గదర్శక మైన సూక్తులు ఎన్నో ఉన్నవి చూడండి.——

తన లోపము లెరుగడమే పెద్దవిద్య

అట్లెరిగినవాడే పరిపూర్ణుడైన మానవుడు——

అని ఒకచోట ఆయన చెప్పినాడు.

ఇంకొకచోట ఆయన——

మనము చూడనట్టి దేవతాగణానికన్న

పదిమందికి ఉపకారము చేసే మనయెదుటి మను ష్యుడే గొప్పవాడని చెప్పినాడు.

మంచివారికి కలిగే యిబ్బందులను గురించి ప్రస్తావిస్తూ ఆయన——

ఈ ప్రపంచ స్వభావాన్ని గురించి ఏమిచెప్పవలెను

మంచి చేసేవానినే ముంచే సంఘటనలు మనముందు ఎన్నో ఉన్నవి అన్నాడు.

ఏపనియైనప్పటికి దాని లక్ష్యాన్ని బట్టియే మంచి చెడ్డలు నిర్ణయము కాగలవు. కావుననే గాలిబ్ ఒకచోట——

సింధువులో పడిన బిందువు సింధుపు అయినట్లు ధ్యేయాన్ని బట్టి ప్రతిపని దివ్యమౌతుందని చెప్పినాడు.

మరొకచోట తనను గురించి చెప్పుకుంటూ——

చక్రవర్తి చేతిలోని బంగారు పాత్రకన్నా
నా చేతిలోని చిప్ప మేలయినదన్నాడు.

ఇది ఆయన అత్మగౌరవ దృక్పథానికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనము.

గాలిబ్ తనజీవితములో అనేక కష్టాలకు గురియైనాడు. విషాద జీవితాన్ని గడిపినాడని చెప్పవచ్చును. ఆయన కవిత్వంలో 'అహం' చాలా ఎక్కువ. సహృదయుడైన వానికి సన్మానము ఎప్పుడూ వెలుపల నే జరుగుతుంది అనిచెప్పి

శుక్తి విడిచినప్పుడే వానచుక్క మౌక్తిక మవుతుంది

అని ఒక రమ్యమైన పోలిక చూపించినాడు.

గాలిబ్‌ను స్మరించినప్పుడు మన శ్రీనాథకవి మన ముందు సాక్షాత్కరిస్తాడు. ఉభయుల జీవితాలు విషాదాంతములైనవి. భావగాంభీర్యము. భాషా ప్రౌఢిమ ఉభయులలో కూడ ఒకేరీతిని మనము చూడవచ్చును. తనకు నిష్కామ కర్మకు మిక్కిలి ప్రియమని గాలిబ్ ఒకమారు చెప్పినాడు.

ఒకసారి ప్రమోదము, ఇంకొకసారి విషాదము
ఒకచోట ఆశ, మరొకచోట నిరాశ
ఒక వంక ప్రేమ, ఇంకొకవంక వేదాంతము——

గోచరించే గాలిబ్ కవిత్వంలో మానవ జీవితం ప్రతిబింబిస్తునది.

విలాసము, విషాదము

తీపి, చేదులతో పాటు మానవ జీవితములోని ఒడుదుడుకులన్నింటిని గాలిబ్ చిత్రించినాడు.

తన పూర్వులైన ఉర్దూకవులవలె కాక శృంగారానికి మాత్రమే పరిమితము చేయక తన కవితను విశాలమైన జీవితరంగానికి విస్తరించి భావప్రకటలోను, భాషా సౌందర్యంలోనూ అంతకుముందు కవులు చూపని నవ్యతను ప్రదర్శించినాడు గాలిబ్. ఉర్దూ సాహిత్యంలో అతని స్థానం అద్వితీయము.

"నాదు చిన్నిగూడు, నాజీవితపుగోడు,
నావిషాద గాథ నాదెకాదె !"

అని ఒకచోట గాలిబ్ చెప్పినమాట ఆయనకు సంపూర్ణంగా అన్వయిస్తున్నది.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)
(21-3-80)

చార్లెస్ ఫిలిప్సు బ్రౌన్

ఆయనది తెలుగుసీమకాదు. ఆయన మాతృభాష తెలుగుకాదు. ఆయనవృత్తి తెలుగుభాషా సాహిత్యాలకు సంబంధించినదికాదు. అయినప్పటికి తెలుగుభాషా వికాసానికి ఆయనచేసిన కృషి మనరాజులు, జమీందారులు చేసిన కృషికన్న ఎన్నియోరెట్లు ఎక్కువఅని చెప్పితే సత్యానికి దూరమైనమాట కాదు. 1798 లో జన్మించిన సి. పి. బ్రౌన్ 1884 వరకు జీవించి ఈస్టిండియా కంపెనీ కింద ఉన్నతోద్యోగాలు చేసి తనకాలాన్ని, శక్తి సామర్థ్యాలను తెలుగు భాషాభివృద్ధికి వినియోగించి, తెలుగుదేశానికి చిరస్మరణీయుడైనాడు- తెలుగు భాగవతం "మనుచరిత్ర, కళాపూర్ణోదయం, వేమన, పద్యాలు మొదలైన అనేక తెలుగు గ్రంథాల వ్రాతప్రతులను సంపాదించి, పండితుల చేత శుద్ధ ప్రతులను వ్రాయించి, ప్రకటించి తెలుగుభాషకు మహోపకారం గావించిన బహుభాషా పండితుడు చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్. వేమనను మొట్టమొదటిసారి ఇంగ్లీషు అనువాదము ద్వారా ఆయన సమస్త ప్రపంచానికి పరిచయం చేసినాడు. తెలుగువారేకాక ఆంధ్రేతరులు కూడా తెలుగును

శాస్త్రీయపద్ధతిలో నేర్చుకోవడానికి దారి చూపించినవాడు ఆయన. ఇంగ్లీషు, గ్రీకు, హీబ్రూ, లాటిన్ మొదలైన పాశ్చాత్య భాషలలోనే కాక- అరబ్బి, ఫారసి హిందుస్థానీ, మరాఠి భాషలలో కూడా వైదుష్యము పరిచయం తగినంత ఉన్నప్పటికిని, తన కాలాన్ని, శక్తిని ధనాన్ని పూర్తిగా ఆంధ్రభాషా వికాసానికి వినియోగించి తెలుగు దేశాన్ని శాశ్వతంగా ఆయన కృతజ్ఞతా బద్ధంగావించినాడు. ఇంగ్లీషు పరిపాలకులతో సమానముగా ప్రక్కన కూర్చొనడానికి తెలుగుపండితులు జంకినకాలంలో వారిని ఆదరించి తనతో సమానంగా కూర్చుండ బెట్టుకొని అన్ని సమావేశాలలో అటువంటి అవకాశాలను వారికి కల్పించిన బ్రౌన్ సౌజన్యం ప్రశంసనీయం.

తెలుగులో అచ్చు సౌకర్యాలు కల్పించుటకు ఆయన విశేషకృషి గావించినాడు. అంతకు పూర్వం అనగా ముద్రణ సౌకర్యం లేక పూర్వం తెలుగు ప్రబంధాలు, వార్తలు, గ్రీక్, లాటిన్ భాషల ప్రాచీన గ్రంథాలవలెనే ఉండినవని ఆయన తెలిపినాడు. తెలుగుకావ్యాలకు అర్థ తాత్పర్యాలు వ్రాయించిన సందర్భంలో పండితులమధ్య అభిప్రాయభేదం కలిగినప్పుడు ఆ అభిప్రాయ భేదాల సారాంశాన్ని ఆయన గ్రంథస్థం చేయించినాడు. అరసున్నను, బండి "ఱ" ను రెండింటిని అనవసరముగా భావించి తాను ప్రకటించిన గ్రంథములలో వానిని ఆయన ఉపయోగించలేదు. వ్యావ

హారిక భాషకు గణ్యతనిచ్చి తాను వ్రాయించిన వ్యాఖ్యానాలలో కూడ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలలోనే కాక నిఘంటువులలో కూడా ఉపయోగించినాడు. తెలుగు వ్యాకరణాన్ని కూడా యిందుకు అనుగుణంగా వ్రాయించి ప్రకటించినాడు. ఉన్నదానికి గతికల్పించడమే వ్యాకరణ ఉద్దేశమని ఆయన అభిప్రాయ పడినాడు. అందుచేతనే ఆయన వ్యాకరణం తెలుగు నేర్చుకునే పాశ్చాత్యులకు బాగా ఉపకరించినది. తెలుగుభాషా వికాసానికి ముద్రణ అభివృద్ధి మిక్కిలి అవసరమని భావించి అందుకు ఆయన కృషిచేసినాడు. పాశ్చాత్యులు ముఖ్యంగా ఇంగ్లీషువారు తెలుగు నేర్చుకున్నప్పుడు అనావశ్యకమైన పదజాలం కంఠస్థం చేయవలసిన అవసరంలేదని, వ్యవహారానికి ఉపయోగపడే పదజాలాన్ని మాత్రమే నేర్పవలెనని ఆయన అభిప్రాయపడి పండితులకు అట్లు చేయవలసినదిగా ఆదేశించినాడు.

ఐరోపాఖండంమీది ఏదేశీయులతో పోల్చినను తెలుగువారు నాగరికతలో వెనుకబడినవారు కారని, అప్పుడప్పుడు వారుమాట్లాడే పద్ధతి ఇటాలియన్‌లను పోలి ఉంటుందని ఆయన వ్రాసినాడు. ఇంగ్లీషువారు, భారతీయులు ఒకరిభాషను ఒకరు నేర్చుకొనినప్పుడే పరస్పరం అర్థం చేసుకోగలరని ఆయన అభిప్రాయపడి అందుకొరకు కృషి చేసినాడు. తెలుగుదేశంలో ఉద్యోగాలు చేసిన బ్రౌన్ పండితుడు తెలుగుప్రజలకు చాలా సహాయం చేసినాడు.

ఆయనలోని యీ మంచితనంవలన తెలుగువారికి అభిమాన పాత్రుడైనాడు. ఆయనను గూర్చిన ఒక చాటువు ఆయనను తలుచుకున్నప్పుడల్లా జ్ఞాపకం వస్తుంది.

"నూర్లార్లు లెక్కచేయక
పేర్లెక్కిన విబుధవరులఁ బిలిపించుచు, వే
మార్లర్థ మిచ్చు వితరణి
ఛార్లెసు ఫిలిప్సు బ్రౌను సాహెబు కరుణన్"

బ్రౌను వ్రాసిన తెలుగు వ్యాకరణం పీఠికలో తెలుగును గూర్చి ప్రకటించిన అభిప్రాయాలు గమనించ దగినవి. యురోపియన్‌లు తెలుగును "జెంటు" అని అంటారని, యీ పేరును పోర్చుగీసువారు పెట్టినారని, యిది అవివేకమైన చర్యఅని, యిటువంటి అవివేకమైన పేరును తీసివేయవలెనని ఆయన చెప్పినాడు. అంతేకాదు, హిందువులైన వ్యాకరణ శాస్త్రవేత్తలు వాడుకభాషకు ప్రాధాన్యం యీయరని కూడ ఆయనచెప్పి ఈ విషయమై హిందూ పండితులకు, చైనాపండితులకు పోలిక ఉన్నదని ఆయన వ్యాఖ్యానించినాడు. తెలుగు, సంస్కృత భాషల సంబంధాన్నిగూర్చి చర్చించే సందర్భంలో సంస్కృతం తెలుగుకు 'తల్లి' అని అంటారని అంతమాత్రాన సంస్కృతం నుంచి తెలుగు ఉద్భవించిందని చెప్పడానికి వీలులేదనీ; తెలుగు మీద సంస్కృత పదజాలంయొక్క ప్రభావాన్ని మాత్రమే యీమాట సూచిస్తున్నదని బ్రౌను వ్రాసినాడు.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)
(16-9-81)